అంతగుంతకూ దారుణంగా..

- ఇంకా గోతులమయంగా రహదారులు
- అరకొర నిధులు మంజూరు
- మాట తప్పిన కూటమి ప్రభుత్వం
- పైపైన పనులు చేసి తప్పకున్న కాంట్రాక్టర్లు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు


అంగర - ఆలమూరు రహదారిలో పూడ్చిన గుంత నుంచి పైకి లేచిన కంకర

కపిలేశ్వరపురం: ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రహదారులను అధ్వానం చేసిందని, కూటమి ప్రభుత్వం రాగానే రహదారులకు మహర్దశ వస్తుందంటూ సార్వత్రిక ఎన్నికల ప్రచారాల్లో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నో మాటలు చెప్పారు. తీరా కూటమి ప్రభుత్వం వచ్చింది. ప్రభుత్వం వచ్చి ఏడు నెలలైనా రహదారులను నిర్మించక పోయే సరికి ప్రజల్లో అసహనం మొదలైంది. ఆ విషయాన్ని గమనించిన సీఎం చంద్రబాబు మరో రాగం అందుకున్నారు. అందమైన రహదారుల నిర్మాణం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది. వచ్చే సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారుల నిర్వహణకు ఆదేశాలిచ్చామంటూ ప్రకటనలు చేశారు. మహర్దశ మాట అలా ఉంచితే గుంతలైనా పూడ్చుతామంటూ మాటలు మారాయి. పోనీ ఇదైనా పరిపూర్ణంగా చేస్తారా అన్న ప్రశ్న ప్రజలను వెంటాడుతూనే ఉంది. సంక్రాంతి వచ్చి వెళ్లింది. తూతూ మంత్రంగా మాత్రమే గుంతలను పూడ్చారు. పెద్ద గోతులను మాత్రమే పూడ్చి చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో అనేక చోట్ల రహదారులు గుంతలతో దర్శనమిస్తున్నాయి.

అరకొర పనులతో సరి

విస్తారమైన రహదారుల గుంతలు పూడ్చేందుకు సైతం ప్రభుత్వం అరకొర నిధులను మంజూరు చేసింది. గతేడాది నవంబర్ 2న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గుంతలను పూడ్చే పనులను ప్రారంభించారు. నిధుల లేమితో పెద్ద గుంతలను పూడ్చి ఊరుకున్నారు. మండపేట నియోజకవర్గంలో మొత్తం 19 మరమ్మతు పనులకు కేవలం రూ.4.30 కోట్లు మాత్రమే కేటాయించారు. తాపేశ్వరం, మండపేట, రామచంద్రపురం మీదుగా వెళ్లే ద్వారపూడి-యానాం రహదారి మరమ్మతులకు కేవలం రూ.20 లక్షలు మాత్రమే కేటాయించారు. మండపేట- జొన్నాడ రహదారి మరమ్మతులకు రూ.60 లక్షలు, పామర్రు-ఉట్రుమిల్లికి రూ.30 లక్షలు, రాజమహేంద్రవరం-కేశవరం వయా పుణ్యక్షేత్రం రహదారికి రూ.12 లక్షలు, రాయవరం మండలం సోమేశ్వరం-రాజానగరం రహదారికి రూ.20 లక్షలు మాత్రమే కేటాయించడం అరకొర నిధులకు తార్కాణం. రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో 21 మరమ్మతు పనులు చేపట్టేందుకు కేవలం రూ.5.83 కోట్లు మాత్రమే కేటాయించింది. రామచంద్రపురం-పెనుగుదురు రహదారి మరమ్మతులకు కేవలం రూ.60 లక్షలు, పామర్రు, ఉట్రుమిల్లికి రూ.30 లక్షలు, యర్రపోతవరం, భీమక్రోసుపాలెం కాకినాడ రహదారికి రూ.15 లక్షలు మాత్రమే కేటాయించింది. నిధులు సరిపడా లేకపోవడంతో పూడ్చిన గుంతలు సైతం నాణ్యతాలోపంతో ఉన్నాయి. అనేక చోట్ల పూడ్చిన గుంతల వద్ద కంకర రాళ్లు చెదిరి దర్శనమిస్తున్నాయి. వాహనాలు పంక్చర్లు పడతాయన్న ఆందోళనలో వాహనదారులున్నారు.

పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టాలి

రెండు నియోజకవర్గల్లోని రహదారులు అత్యంత ప్రాధాన్యం గల రహదారులు. రాష్ట్రంలోనే ప్రాధాన్యత ఉన్న ఆధ్యాత్మిక కేంద్రాలు రెండు నియోజవర్గాల్లోనూ ఉన్నాయి. దక్షిణ కాశీగా పేరొందిన ద్రాక్షారామకు రాష్ట్రంలోని నలుమూలల నుంచీ తరలివస్తారు. నవ జనార్దనాలయాల్లో మూడు ఆలయాలు మండపేట నియోజకర్గంలోని మండపేట, కపిలేశ్వరపురం, మాచర గ్రామాల్లో ఉన్నాయి. అష్ట సోమేశ్వరాలయాల్లో కోటిపల్లి, కోరుమిల్లి ఆలయాలు ప్రసిద్ధి చెందినవి. ఇలా ఆధ్యాత్మికతతో పాటు రెండు నియోజకవర్గ కేంద్రాల్లో కార్పొరేట్, ప్రైవేటు విద్యాలయాలు, పరిశ్రమలు ఉన్నాయి. మండపేట నియోజకవర్గంలో ఇటుక, రైస్‌మిల్లు, కోళ్ల పరిశ్రమలధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రహదారుల ప్రాధాన్యం అధికంగా ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రహదారులను పూర్తి స్థాయిలో నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

పశువులకు వైద్య సేవలు


కాలేరులో పశువుల మందులను అందజేస్తున్న డాక్టర్ రమణమూర్తి

కపిలేశ్వరపురం: కాలేరులో గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి వీవీ రమణమూర్తి 92 పాడి గేదెలు, ఆవులకు వైద్యసేవలనందించారు. అవసరమైన మేరకు మెరుగైన వైద్య సేవలనిందించేందుకు నివేదించారు. పాడి రైతులకు ఉచితంగా మందులను అందజేశారు. పాడి పరిశ్రమాభివృద్ధి లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి రమణమూర్తి తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి జన్మ నక్షత్ర పూజలు


విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలను ఘనంగా చేశారు. ఆలయ అర్చకులు తెల్లవారు జామున స్వామిని విశేషంగా అలంకరించారు. పంచామృతాభిషేకం పూజల్లో అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వచ్చే నెల 1, 3 తేదీల్లో పరీక్షలు

కాజులూరు: ఏపీ స్టేట్ సెక్రటరీ, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ వారి ఆదేశాల మేరకూ వచ్చే నెల 1, 3 తేదీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పర్యావరణ విద్య, నైతిక, మానవతా విలువలపై పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక కళాశాలలో ఆయన విలేకరులతో ఆయన మాట్లాడారు. తమ కళాశాలలో వచ్చే నెల 1వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నైతిక, మానవతా విలువలు అనే సబ్జెక్ట్‌పై, 3న ఉదయం 10 గంటల నుంచి పర్యావరణ విద్యపై పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌కు సాయం


రామకృష్ణకు సాయం అందిస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ కళ్యాణ్

కె.గంగవరం: మసకపల్లి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రామకృష్ణకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలియో కాలికి గాయమైంది. ఆపరేషన్ అనంతరం రామకృష్ణ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతనిని ఆర్థికంగా ఆదుకోవడానికి ఆ గ్రామ సర్పంచ్ పిల్లి అన్నపూర్ణ కళ్యాణ్ తన వంతు రూ. 10 వేలును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్ రామకృష్ణ విధి నిర్వహణలో ఎంతో బాధ్యతగా ఉంటారని, ఆయన్ని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయవరం: వార్షిక పనుల కారణంగా స్థానిక రాయవరం సబ్‌స్టేషన్ 11 కేవీఏ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని రామచంద్రపురం సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు బిక్కవోలు మండలం కొమరిపాలెం, మండలంలోని రాయవరం, వి.సావరం, వెదురుపాక, నదురుబాద, లొల్ల, అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుస్తుందని, వినియోగదారులు సహకరించాలని ఈఈ రత్నాలరావు కోరారు.

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని కపిలేశ్వరపురం మండల కేంద్ర ఫీడర్ పరిధిలో అంగర గ్రామలైన్‌కు శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. విద్యుత్ లైన్ల వెంబడి చెట్ల కొమ్మలను తొలగించే నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు తెలిపారు. అంగర గ్రామ వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


కోలంకలో రైతులకు సూచనలు చేస్తున్న ఏరువాక శాస్త్రవేత్త శర్మ

కాజులూరు: రైతులు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక శాస్త్రవేత్త ఏఎస్ఆర్ శర్మ అన్నారు. కోలంకలో మండల వ్యవసాయాధికారి వి.అశోక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో శర్మ, డీఆర్‌సీ ఏడీఏ పి.మాధవి తదితరులు పాల్గొని ఎరువుల యాజమాన్యంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో పెట్టుబడులు తగ్గించి నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎన్‌పీఎస్ఎస్ యాప్ ద్వారా పంటకు హాని కలిగించే పురుగులు, తెగుళ్లను గుర్తించి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు అవసరానికి మించి ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల భూమికి, పంట ఉత్పత్తులకు జరిగే అనర్థాలను వివరించారు.

సామాజిక బాధ్యతతో కుష్ఠు నివారణ


అచ్యుతాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు

కపిలేశ్వరపురం: కుష్ఠువ్యాధి నివారణ సామాజిక బాధ్యతగా అందరూ భావించాలని గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో పాల్గొన్న వక్తలన్నారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయదీపిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్య కార్యకర్తలు, ప్రభుత్వ శాఖల సిబ్బంది, గ్రామాల ప్రజలు వ్యాధి నివారణ కార్యక్రమాల్లో పాల్గొంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. వల్లూరు, వడ్లమూరు, అచ్యుతాపురం, నేలటూరు, కాలేరు, నల్లూరు గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఎంపీహెచ్ఈఓ మాట్లాడుతూ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ముందస్తుగానే లక్షణాలను గుర్తించడం ద్వారా వ్యాధి వ్యాప్తి, తీవ్రతలను తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ శ్రీధర్, హెచ్‌వీ వి.వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ ఎస్.రవీంద్రకుమార్, వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కాకండి


మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్


హాజరైన పోలీస్ అధికారులు, విద్యార్థులు, అధ్యాపకులు

రామచంద్రపురం: మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ సూచించారు. స్థానిక వీఎస్ఎం అటానమస్ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ ఆలీ అన్సారీ అధ్యక్షతన మాదక ద్రవ్యాల వినియోగంతో నష్టాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రఘువీర్ మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు అలవాటు పడటం అనేది చాలా తేలికైన అంశంగా భావిస్తున్నారని, వీటి వినియోగం నేరమనే విషయాన్ని గ్రహించాలన్నారు. మత్తుకు అలవాటు పడిన వారు నేరాలకు పాల్పడుతూ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. దురలవాట్లు కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను డీఎస్పీ రఘువీర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సీఐ ఎం.వెంకటనారాయణ మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమ్స్, యాప్స్ ద్వారా జరుగుతున్న ఆర్థిక నష్టాలను వివరించారు. ఎస్సై నాగేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల ఎక్కువగా బైక్స్ నడుపుతున్న యువత వల్ల జరుగుతున్నాయని, కాస్త జాగ్రత్త ప్రాణాలు నిలబెడుతుందని గ్రహించాలన్నారు. రోడ్డుపై వాహనాలను నడిపే సమయంలో వేగంగా వెళ్లకుండా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.రవీంద్ర, వినియోగదారుల ఫోరం స్టేట్ ఈసీ డి.అభిరామ్, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎ.రాంబాబు, వెంకటదుర్గ, బి.కృష్ణవేణి, హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి


కె.గంగవరంలో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు


మహనీయులకు నివాళులు అర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

కాజులూరు: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మండల ఆర్యవైశ్య సంఘ మాజీ అధ్యక్షుడు వరదా శేషారావు అన్నారు. గురువారం కోలంకలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, గొల్లపాలెంలో మండల గౌడ సంఘ కార్యదర్శి అంగర శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక నాయకులు కడలి రాంపండు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కె.గంగవరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గాంధీ చిత్రపటానికి ఎంపీపీ పంపన నాగమణి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. బీసీ నాయకుడు పంపన సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు చీకట్ల గోపాలం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

మండపేట: జాతిపిత మహాత్మాగాంధీజీ వర్ధంతిని ద్వారపూడి వాసవీక్లబ్ ఆధ్యర్యంలో నిర్వహించారు. గ్రామంలోని మహనీయులైన గాంధీ, పొట్టిశ్రీరాములు విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్రీగాకోళ్లపు శంకర్, తటవర్తి రమేష్, యక్కల వెంకటేశ్వరరావు, కొనగళ్ల రాజా, బోడా సత్యనారాయణ, వాకచర్ల రాజు, ఖండవల్లి రామకృష్ణ, వాకచర్ల నాగబాబు పాల్గొన్నారు.

ఘనంగా భావనా రుషి ఆలయ ప్రతిష్ఠ పూజలు


పసలపూడిలో విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ, గ్రామస్తులు

రాయవరం: పసలపూడి గ్రామం గోపరితోటలో భద్రావతి సమేత భావనా రుషి ఆలయ ప్రతిష్ఠ పూజలు రెండో రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు శతాధిక ప్రతిష్ఠాపనాచార్య, వైఖానాసగమ ప్రవర పెదపూడి రఘురాం అర్చకత్వంలో పూజలు చేశారు. వేద పండితులతో పుణ్యాహవాచనం, పంచగవ్యారాధన, పంచగవ్యప్రాసనం, అగ్ని మథనం, సమగ్ర పూజ, ఆదివాస హోమం, పాయశ హోమం, అగ్ని హోమం తదితర హోమాలు చేశారు. సుమారు 10 మంది దంపతులు పీటల మీద కూర్చుని పూజల్లో పాల్గొన్నారు. శుక్రవారం పునఃప్రతిష్ఠ చేసే భవనా రుషి, గణపతి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి


కంప్యూటర్ కోర్సుల గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

మండపేట: మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్తపుంతలు తొక్కుతున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని అందిపుచ్చుకుని విద్యార్థులు రాణించాలని పోలిశెట్టి సత్తిరాజు భూషణం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీ సురేంద్ర తెలిపారు. గురువారం తాపేశ్వరం పాఠశాలలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థుల కోసం పారిశ్రామిక సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఒకేషనల్ కోర్సు ఉపాధ్యాయుడు వైఎస్ రాజు పారిశ్రామిక సందర్శనలో భాగంగా పట్టణంలోని ఎస్ఆర్ ఇన్నోవిజన్ ఇనిస్టిట్యూట్‌లో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. అలాగే కంప్యూటర్ల పనితీరు, విడి భాగాలు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సులపై వర్క్‌షాపు నిర్వహించారు. ఉపాధ్యాయులు సాయిరామ్, శ్రీనివాస్, ఒకేషనల్ కోర్సు శిక్షకుడు వైఎస్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్యుకేషన్ ఎక్స్‌పో


స్టడీ ఎక్స్‌పో తిలకిస్తున్న రామచంద్రపురం డీవైఈఓ రామలక్ష్మణమూర్తి

రాయవరం: స్థానిక సాయితేజా విద్యానికేతన్‌లో గురువారం ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహించారు. ఎడ్యుకేషన్ ఎక్స్‌పోలో లైఫ్లీ హుడ్, లాంగ్వేజ్ క్లబ్ విభాగాలలో 700 మంది విద్యార్థులు తయారు చేసిన 350కు పైగా ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ కర్రి పద్మావతి, అకడమిక్ డైరెక్టరు భానురేఖసందీప్‌రెడ్డి, ముఖ్యంగా మొబైల్ యాప్ ద్వారా పని చేసే స్మార్ట్ హోమ్, మల్టీపర్పస్ రోడ్డు, స్మార్ట్ హెల్మెట్, ఆటోమేటిక్ రైల్వేగేట్, సైకిల్ వాషింగ్ మెషిన్, స్టెమ్ సెల్ టెక్నాలజీ, మానవ పరిణామ క్రమం, ప్రభావం, భగవద్గీత తదితర ప్రాజెక్టులు ఆహుతలను ఆకట్టుకున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఎక్స్‌పోను సర్పంచ్‌లు చంద్రమళ్ల రామకృష్ణ, చాట్రాతి జానకిరాంబాబు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీడీవో ఎస్.కీర్తిస్పందన, రామచంద్రపురం డీవైఈవో పీఎల్ఎస్ మూర్తి, ఎంఈవో-2, వై.సూర్యనారాయణ, ఎస్సై డి.సురేష్‌బాబు, స్థానిక నాయకులు వుండవిల్లి రాంబాబు, పడాల కమలారెడ్డి, వైద్యులు జి.గోపిరవితేజ, ప్రత్యూష, వీఎస్ఆర్ రూరల్ డిగ్రీ కళాశాల డైరక్టరు ఎం.అమ్మిరెడ్డి, బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి తదితరులు స్టడీ ఎక్స్‌పోను సందర్శించారు.

చలి తగ్గలే.. రోగాలు ఆగలే!

- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసమే కారణం


కె.గంగవరంలో ఉదయం 7 గంటలైనా వీడని పొగ మంచు

కె.గంగవరం: చలి ఎక్కడా తగ్గడం లేదు.. అలాగని సూర్యుడూ ఆగడం లేదు.. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ ఎండ దంచుతుంటే, సాయంత్రం ఆరు నుంచి ఉదయం వరకూ చలి దడ పుట్టిస్తోంది. వాతావరణంలో అనూహ్య మార్పులతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇదే సీజనల్ వ్యాధులకు కారణమవుతోంది. దీంతో ఆసుపత్రులకు జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. రోగాల బారిన పడకుండా ఉండాలంటే జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. చల్లని వాతావరణంలో ఎక్కువ సమయం గడపకుండా అప్రమత్తంగా ఉండాలని, సాధ్యమైనంత వరకూ వేకువ జామున, రాత్రి వేళల్లో బయట సంచరించరాదని అంటున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. ఉదయం పొగ మంచు, గాలులు విజృంభిస్తున్నాయి. దీనివల్ల శ్వాసకోస వ్యాధిగ్రస్తులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వ్యాయామం పేరుతో గంటల కొద్దీ ఓపెన్ ఎయిర్ గ్రౌండ్స్, పార్కులలో తిరగడం తగ్గించాలి. ఇంట్లో, ఇండోర్ స్టేడియంలో మాత్రమే వ్యాయామం చేయడం మంచిది. అరగంట పాటు సురక్షిత ప్రాంతంలో నడక, ఆటలు కొనసాగించాలి.

తస్మాత్ జాగ్రత్త

ప్రస్తుతం ఉదయం పూట పొగ మంచు విపరీతంగా పడుతోంది. గుండె జబ్బులు, మధుమేహం, ఆస్తమా వ్యాధిగ్రస్తులకు ఒక విధంగా శీతాకాలం శత్రువే. శరీరం వ్యాధుల బారిన పడేది ఈ సీజన్‌లోనే. ఎప్పుడైనా గుండెలో నొప్పిగా అనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న చిన్నారుల విషయంలో జాగ్రత్తలు వహించాలి.

బయట తిరగడం మంచిదికాదు



చలికాలంలో ఆరోగ్యవంతులు సైతం వ్యాధుల బారిన పడే ముప్పు ఉంది. గోరు వెచ్చని నీటినే తాగాలి. రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలి. ఉదయం, రాత్రి సమయాల్లో ఆరు బయట తిరగడం మానుకోవాలి. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే రక్షణ దుస్తువులు ధరించాలి. అలర్జీ, జలుబు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

–పశుపులేటి విష్ణువర్ధన్, పీహెచ్‌సీ వైద్యుడు, పామర్రు

అగ్గి తెగులుకు అవకాశం



ప్రస్తుతం పొగ మంచు వల్ల రబీ పంటలో అగ్గితెగులు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రైతులు ప్రతి రోజూ ఉదయం సూర్యోదయం అయ్యాక చేల వద్దకు వెళ్లి వరి పైరుపై ఆశించే తెగులు వ్యాప్తిని పరిశీలించుకోవాలి. లేకుంటే తెగులు వ్యాప్తి ఎక్కువైతే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

–బలుసు రవి, వ్యవసాయాధికారి, కె.గంగవరం

బాల కార్మికులతో పని చేయించవద్దు

కార్మిక శాఖాధికారి నాగమల్లేశ్వరరావు


ఆలమూరులో ఇటుక బట్టీ కార్మికులతో మాట్లాడుతున్న నాగమల్లేశ్వరరావు

ఆలమూరు: ఇటుక బట్టీలలో బాల కార్మికులను చేర్చుకోవద్దని మండపేట కార్మిక శాఖాధికారి నాగమల్లేశ్వరరావు యజమానులను ఆదేశించారు. ఆలమూరులోని ఇటుక పరిశ్రమలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంస్థల యజమానులు తప్పనిసరిగా కార్మికుల రిజిస్టర్లు, రికార్డులు నిర్వహించాలన్నారు. కార్మిక చట్టాలను సమర్థంగా అమలు చేసి, వారి హక్కులను పరిరక్షించాలన్నారు. పని ప్రదేశాలలో కార్మిక చట్టాలను అమలు చేసే బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. అనంతరం ఇటుక పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులలో ఉన్న లోపాలను సవరించుకోవాలని సూచించారు. ఒక్కొక్క కార్మికునికి రూ.వంద చొప్పున కార్మిక సంక్షేమ నిధికి చెల్లించి, కార్మికులకు అండగా నిలవాలన్నారు. కార్మికులకు విధిగా కార్మిక వేతన చట్టం అమలు చేయాలని తెలిపారు.